క్లుప్తంగా

రైతు కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న గుమ్మనూరు నారాయణ

చిప్పగిరి: వారం క్రితం పాముకాటుతో రెండు వృషభాలు మృతి చెంది రూ.1.50 లక్షల మేర నష్టపోయిన దౌల్తాపురం గ్రామానికి చెందిన మేకల కోదండ అనే రైతుకు ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ మంగళవారం రూ. 20,000 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శేఖన్న ,కొండ సుంకన్న, నెట్టికంటి, రాజశేఖర్, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

బదిలీ హెచ్‌ఎంకు సన్మానం



హెచ్‌ఎం జమ్ములన్నను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

వెల్దుర్తి: స్థానిక బాలుర జెడ్పీ హైస్కూల్ హెచ్ఎంగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న జమ్ములన్నను ఆ పాఠశాల 1988–89 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. హరిసింహ నాయుడు, పామయ్య యాదవ్‌లు హెచ్‌ఎంకు పూలమాల, శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందించారు. వెల్దుర్తి హైస్కూల్‌లోనే చదివి, అదే పాఠశాలకు హెచ్‌ఎంగా విధులు నిర్వహించిన జమ్ములన్న సేవలు కొనియాడారు.

సీఐ మధుసూదన్‌రావుకు ఉత్తమ సేవా అవార్డు



జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న సీఐ మధుసూదన్‌రావు

ఎమ్మిగనూరురూరల్: జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ చేతు మీదుగా మంగళవారం ఉత్తమ సేవా అవార్డును టౌన్ సీఐ మధుసూదన్‌రావు, హెడ్ కానిస్టేబుల్ గొల్ల మద్దిలేటి, హెచ్. నాగరాజు, క్రైం పార్టీ కానిస్టేబుల్ ఉసేన్‌బాషాలు ప్రశంసా పత్రాలను అందుకున్నారు. గ్లాంబింగ్, మిస్సింగ్ కేసులు, ఇతర కేసుల ఛేదనలో ప్రతిభ కనపరిచినందుకు ఈ ప్రశంసా పత్రాన్ని జిల్లా ఎస్పీ అందచేసినట్లు సీఐ మధుసూదన్‌రావు తెలిపారు. అలాగే ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ మురళీ కూడా బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డును అందుకున్నారు.

నందవరం ఎస్‌ఐగా తిమ్మయ్య



నందవరం : నందవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా పి.తిమయ్య నియమితులయ్యారు. ఈయన త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ మహేష్‌కుమార్‌ను ఉన్నాతాధికారులు వీఆర్ బదిలీ చేశారు. భూతగాదాల్లో సివిల్ పంచాయతీలు చేశారని ఆరోపణలతో ఉన్నాతాధికారులు విచారణ చేసి, శాఖపరమైన చర్యల్లో భాగంగా వీఆర్‌కు పంపుతున్నట్లు సోమవారం రాత్రి ఉత్వర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ఆళ్లగడ్డ టౌన్‌లో పని చేస్తున్న ఎస్‌ఐ పి. తిమయ్యను బదిలీ చేసినట్లు ఉత్తర్వులు ఇచ్చారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



హాలహర్విలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ దశరథరామయ్య

నందవరం : గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని లబ్ధిదారులకు ఎంపీడీఓ దశరథరామయ్య సూచించారు. మంగళవారం మండల పరిధిలోని హాలహర్వి గ్రామంలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈ గురుస్వామితో కలిసి పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 1.80 లక్షలు, పొదుపు సంఘం ద్వారా రూ.35 వేల రుణం అందిస్తుందన్నారు. వీలైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి సుజాత, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయండి

ఎమ్మిగనూరుటౌన్: మదనపల్లిలో ఈనెల 19న జరుగనున్న రాయలసీమ బహుజన రాజ్యాధికార సభను జయప్రదం చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు జైరాజ్, ప్రధాన కార్యదర్శి ఎర్రన్న పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో బీఎస్పీ సభ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. రాయలసీమ స్థాయిలో నిర్వహించే ఈసభకు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, బహుజనులు తరలిరావాలని కోరారు.



''ఈఫొటో కనిపిస్తున్న మహిళ కురువ జయమ్మ. ఈమెది నందవరం మండలం నదికైరవాడిగ్రామం.ఈమె కుటుంబం గుడిసెలో నివాసం ఉండేది. ప్రభుత్వం కొత్తకైరవాడి గ్రామంలో ఇంటిస్థలం ఇచ్చి ఇల్లుకూడా నిర్మించింది. సీఎం వైఎస్ జగన్ చలువతో సొంతింట్లో సుఖంగా ఉన్నామంటూ సంతోషం వ్యక్తం చేస్తుంది. ఇంటి నిర్మాణానికి రూ.1.8లక్షలతో పాటు వైఎస్ఆర్ ఆసరా, చేయూత, రైతుభరోసా, సున్నవడ్డీ రుణాలు, పంటబీమా కూడా పొందిన అదృష్టవంతురాలు నేనేంటూ గర్వంగా చెప్పుకొంటుంది జయమ్మ.''



''సొంతంగా స్థలంకూడా కొనలేని బతుకులు మావి.అలాంటిది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యాన జగనన్న కాలనీలో స్థలం ఇవ్వటమే కాకుండా అందమైన ఇల్లు కట్టించాడు. పేదోళ్లకు కూడుపెట్టడమేకాదు గూడు కట్టించి మా బతుకుల్లో వెలుగులు నింపాడు. ఆయన పదికాలాలు పాలించాలి..పేదోళ్ల జీవితాలు పచ్చగా మారాలి''అంటూ దీవించింది ఎమ్మిగనూరు మండలం బోడబండ జగనన్న కాలనీకి చెందిన జయమ్మ. ఈ మాటలు బోడబండ జయమ్మో లేక నదికైరవాడి జయమ్మోలది మాత్రమేకాదు ఎమ్మిగనూరు నియోజకవర్గంలో జగనన్న కాలనీల్లో ఇళ్లు కట్టుకున్న 6648మంది లబ్ధిదారులది. నిరుపేదల గుండెల్లో 'గూడు' కట్టుకున్న సీఎం జగనన్నపై అభిమానం.

జనం గుండెల్లో జగనన్న 'గూడు'

- చురుగ్గా జగనన్న కాలనీల నిర్మాణం
- మంజూరైన గృహాలు 6,648, పూర్తయినవి 3,397
- చెల్లించిన బిల్లులు రూ.43.93కోట్లు



బోడబండ జగనన్నకాలనీ,



నందవరంలో జరుగుతున్న ఇళ్లనిర్మాణం

ఎమ్మిగనూరు: ప్రతిపేదవాడికి సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన జగనన్న కాలనీల నిర్మాణాలు పేద కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల్లో భాగంగా ఇళ్లులేని నిరుపేదలను గుర్తించి ఇళ్లస్థలాలను మంజూరు చేశారు. ఇందుకోసం ప్రభుత్వం కోట్లాది రూపాలయలు వెచ్చించింది. ప్రభుత్వం జగనన్న కాలనీల్లో ఇచ్చిన స్థలాల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు. ఎమ్మిగనూరు మున్సిపాలిటి పరిధిలో టిడ్కో ఇళ్ల సముదాయాల పక్కన 2,750మంది పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చి ప్రభుత్వం ఇళ్లనిర్మాణాలను చేపట్టింది.

ఎమ్మిగనూరు మండలంలో 16 పంచాయతీల్లో ఇళ్ల నిర్మాణం జరుగుతుంది. కోర్టు కేసుల మూలంగా బనవాసి, గోనెగండ్ల, సోగనూరు గ్రామపంచాయతీల్లో పనులు నిలిచిపోయాయి. గోనెగండ్ల మండలంలో 20 పంచాయతీల్లో, నందవరం మండలంలో 14 పంచాయతీల్లో ఇళ్ల నిర్మాణం జరుగుతుంది.

ప్రభుత్వ తోడ్పాటు

పేదలకోసం మంజూరు చేసిన జగనన్న లే అవుట్ కాలనీల్లో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వ తోడ్పాటునందిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.1.80లక్షలు కేటాయిస్తున్నాయి. పొదుపు సంఘాల్లో ఉన్న మహిళలకు రాష్ట్రప్రభుత్వం రూ.50వేలు చొప్పున బ్యాంక్ రుణాలు అందేలా చర్యలు చేపట్టింది. లబ్ధిదారుల అభిరుచికి అనుగుణంగా వారు మరింత సొమ్మును జమచేసుకొని అందమైన ఇళ్లు నిర్మించుకుంటున్నారు. ఎమ్మిగనూరు నియోజక వర్గంలోని జగనన్న లే అవుట్లలో, లబ్ధిదారుల సొంత స్థలాలోనూ నిర్మాణాలు జగురుతున్నాయి. నందవరం మండలంలో 473 గృహాలు, గోనెగండ్ల – 13722, ఎమ్మిగనూరు మండలం – 2053, ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పరిధిలో 2750 ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి.

జగనన్న లే అవుట్‌లలో,సొంతస్థలాల్లో నిర్మాణం తీరు ఇలా..

మండలం/ టౌన్	మంజూరైనవి ఇళ్లు	వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నవి	పూర్తయిన ఇళ్లు	చెల్లించిన బిల్లులు
ఎమ్మిగనూరు	2053	661	1392	రూ.15.08కోట్లు
మున్సిపాలిటి	2750	1155	1595	రూ.16.07కోట్లు
నందవరం	473	357	116	రూ. 3.30కోట్లు
గోనెగండ్ల	1372	1078	294	రూ.9.48కోట్లు
మొత్తం	6648	3251	3397	రూ.43.93 కోట్లు

మౌలిక వసతుల కల్పన

జగనన్న కాలనీల అభివృద్ధి కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది.లే అవుట్ కాలనీల్లో అంతర్గత రోడ్లు,డ్రైనేజీ,నీటివసతి కల్పన,విద్యుత్ సౌకర్యంకు అధిక ప్రాధాన్యతను ఇచ్చి పనులను చేపడుతోంది. అదేవిధంగా సిమెంట్ ,స్టీల్‌లను ప్రభుత్వమే సరఫరా చేస్తూ సౌకర్యాలను కల్పిస్తోంది. దాదాపు 60శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇప్పటికే గృహ ప్రవేశాలు చేశారు. ఆరు నెలల వ్యవధిలో సాధ్యమైన మేరకు ఎక్కువ ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం హౌసింగ్ అధికారులకు లక్ష్యాలను నిర్దేశించింది.

ఇది జగన్ ఇచ్చిన వరం



మాలాంటి నిరుపేదలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన వరం. సొంతిళ్లులేనందను చాలా ఇబ్బందులు పడ్డాం. జగనన్న కాలనీతో సొంతింటి కల తీరింది. ఇంటిస్లాబ్ వేసుకున్నాం. శ్రావణమాసంలో గృహప్రవేశం కూడా చేస్తాం. జగనన్న సాయం మరువం.

– మంగలి జ్యోతి, నందవరం

ఆడపడచులకిచ్చిన గౌరవం



ఆడపడచులపట్ల సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి చాలా అభిమానం. ప్రతి పథకాన్ని మహిళల పేరుతో ఇస్తూ సమాజం, కుటుంబంలో ఆడపచుల గౌరవాన్ని పెంచారు. జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకున్నాం. సొంతింట్లో నివాసం మా కుటుంబానికి ఎంతో ఆనందాన్నిచ్చింది.

– మంజులమ్మ,గోనెగండ్ల

గృహ నిర్మాణాల వేగం పెంచుతాం



జగనన్న కాలనీ లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయి. దాదాపు 60శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తికావచ్చాయి. మిగిలిన ఇళ్ల నిర్మాణాల వేగం పెంచి ఆరునెలల్లో పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. కాలనీల్లో మౌళిక వసతులు ఏర్పాటయ్యాయి.

– ప్రసాద్,హౌసింగ్ డీఈ–ఎమ్మిగనూరు

జగనన్న విద్యా కానుక పంపిణీ



రామళ్లకోట జెడ్పీ హైస్కూల్‌లో విద్యాకానుక కిట్లను విద్యార్థికి అందిస్తున్న మాధవస్వామి నాయుడు



పుల్లగుమ్మి ఎంపీపీ స్కూల్‌లో స్టీలు గ్లాసులో రాగిజావ తాగుతున్న విద్యార్థులు

వెల్దుర్తి: మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం జగనన్న విద్యా కానుక పంపిణీ జరిగింది. రామళ్లకోట జెడ్పీ హైస్కూల్‌లో వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి మాధవస్వామి నాయుడు విద్యార్థులకు కానుకలను పంపిణీ చేశారు. వెల్దుర్తి బాలికల హైస్కూల్‌లో నూతన హెచ్‌ఎం చంద్రావతి చేతుల మీదుగా విద్యాకానుక పంపిణీ జరిగింది. అలాగే రాగిజావ తాగేందుకు ప్రతి విద్యార్థికి విద్యాకానుకకు తోడుగా నాణ్యమైన స్టీలు గ్లాసు అందించారు. పుల్లగుమ్మి ఎంపీపీ స్కూల్‌లో హెచ్‌ఎం స్వామన్న, టీచర్ సుధారాణి స్టీలు గ్లాసులు పంపిణీ చేశారు.

నందవరం : మండల పరిధిలోని హాలహర్వి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎంసీ చైర్మన్ ఖాసిం విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. జగ్గాపురం పాఠశాలలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నరసరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఈరన్న, శేఖర్, ఇందిరా, నాగరాజు, సాలన్న తదితరలు పాల్గొన్నారు.

హొళగుంద: ఎల్లార్తి కన్నడ ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం విజయమ్మ, పీఎంసీ చైర్మన్ లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్కే గిరి విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశారు. కార్యక్రమంలో టీచర్లు సుచరిత, శరణప్ప పాల్గొన్నారు.

చిప్పగిరి: మండలంలోని నంచర్ల గ్రామంలో వైస్ ఎంపీపీ నరసింహులు ఆధ్వర్యంలో జగనన్న విద్యాకానుక కిట్లును విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ రామాంజినేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ బిల్లుల విడుదల

తుగ్గలి : ఉపాధి హామీ కింద మండలంలో చేపట్టిన దాదాపు 270 పనులకు సంబంధించిన బిల్లులు రూ.1.72,5000 విడుదలైనట్లు మంగళవారం ఏపీఓ రామకృష్ణ తెలిపారు. పండ్ల తోటల పెంపకం, ప్రభుత్వ భవన నిర్మాణాలు, సీసీరోడ్లు తదితర పనులకు సంబంధించిన బిల్లులు అప్‌లోడ్ చేశామన్నారు. వారంలోగా రైతులు, కాంట్రాక్టర్ల ఖాతాల్లోకి నగదు జమ అవుతాయన్నారు.

మెలకువలు పాటించాలి

కృష్ణగిరి: వేరుశనగ సాగులో రైతులు మెలుకువలు పాటించి మంచి దిగుబడులు సాధించాలని నీతి ఆయోగ్ సీనియర్ రిసర్చ్ అధికారి అనురాధ అన్నారు. మండల పరిధిలోని చిట్యాల గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో మంగళవారం ఆమె వేరుశనగ సాగుపై రైతులతో మాట్లాడారు. పంట సాగు చేసే సమయం నుంచి దిగుబడులు చేతికి వచ్చే వరకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారో రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కర్నూలు ఏడీఏ శ్రీనివాసరెడ్డి, పత్తికొండ ఏడీఏ మోహన్ విజయకుమార్, ఏఓ వెంకటేశ్వర్లు, ఏఈఓ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

ఎమ్మిగనూరుటౌన్: ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో యోగాకు ప్రాధాన్యత ఇవ్వాలని అప్పుడే మానసిక ప్రశాంతతతో పాటు ఏకాగ్రత, శారీరక దారుఢ్యం లాంటి ప్రయోజనాలు చేకూరతాయని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా, వైస్ ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఎస్‌ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌డీసీ, ఏపీఎస్‌ఎస్‌డీసీల ఆధ్వర్యంలో జన్ భాగిదారి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు యోగా తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌గౌడ్, స్కిల్ డెవలప్‌మెంట్ సమన్వయకర్త సుధాకర్, ట్రైనర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థుల బంగారు భవితకు బాట

- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
- విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ



బాలికలకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: జగనన్న విద్యాకానుక విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేస్తుందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మంగళవారం పత్తికొండ పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చదువు మాత్రమే పేదవాడి తలరాతను మారుస్తుందని బలంగా నమ్మిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. గత నాలుగేళ్లలో విద్యారంగానికి ప్రభుత్వం రూ.60వేల కోట్లను ఖర్చు చేసిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా బడులు తెరిచిన మొదటి రోజు నుంచే ఉచిత విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్నారన్నారు. అమ్మ ఒడి పథకం ద్వారా తల్లుల బ్యాంకుఖాతాలకు ఏడాదికి రూ.15వేలు అందజేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం ప్రవేశపెట్టి కార్పొరేట్ చదువులు అందిస్తున్నారన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు వెంకమ్మ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సిబ్బంది ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణదాసు, పత్తికొండ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కొమ్ముదీపిక, ఎంపీటీసీ సభ్యుడు నీలకంఠ, ఎంఈఓ మస్తాన్‌వలి, హెచ్‌ఎం వెంకమ్మ, సర్పంచులు అంజినయ్య, రహిమాన్, ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సోమశేఖర్, శ్రీరంగడు, నాగరాజు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకం



మద్దికెరలో సమస్యలు వింటున్న కంగాటి శ్రీదేవి

మద్దికెర : రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన మద్దికెరలో గడప గడప కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి గడప గడపకు అపూర్వ ఆదరణ లభించింది. వివిధ సంక్షేమ పథకాలు అందాయని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి అభివృద్ధి, సంక్షేమ పథకాలు రెండు కళ్లుగా భావించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రతి ఒక్కటి నెరవేర్చడమే గాకుండా సంక్షేమ పథకాలు అందుతున్నాయో తెలుసుకోడానికి ప్రజాప్రతినిధులు ప్రజల వద్దకు ధైర్యంగా వెళ్లేందుకు గడప గడపకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మురళీధర్ రెడ్డి, ఎంపీపీ అనిత, సర్పంచులు సుహాసిని, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆంజనేయులు, శ్రీనివాసులు, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

27 నుంచి విద్యా వైజ్ఞానిక సాంస్కృతిక సమ్మేళనం

ఆస్పరి: ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు గుంటూరులో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక సాంస్కృతిక సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కారుమంచి పిలుపునిచ్చారు. మంగళవారం ఆస్పరిలో సమ్మేళనానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు రమేష్, లక్ష్మన్న, రంగప్ప, దస్తగిరి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట గ్రామ సమీపంలో సోమవారం అర్ధరాత్రి ఏపీ39 కేడబ్ల్యూ 4765 అనే నెంబర్ గల కారు అదుపుతప్పి బోల్తా కొట్టి పొలాల్లో పడిపోయింది. ప్రమాదంలో కారు డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తికి గాయాలైనట్లు తెలిసింది. గాయపడ్డ వారు ఆదోనికి వెళ్లి చికిత్స పొందుతున్నట్లు రూరల్‌పోలీసులు మంగళవారం తెలిపారు. ఉదయం పొలాల్లో బోల్తా పడ్డకారును రూరల్ ఏఎస్‌ఐ బాలజీనాయక్, పోలీసులు క్రేన్ సాయంతో రోడ్డుపైకి తీసుకువచ్చారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పట్టణంలోని కర్నూలు రోడ్డులో ఎద్దుల మార్కెట్ వద్ద మంగళవారం ఉదయం గుడకల్ చెందిన ఆంజనేయులు బైక్‌పై వస్తుండగా అదుపు తప్పి డివైండర్‌ను ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గువ్వలదొడ్డి గ్రామంలో అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తి చెంది గొరవ కిష్టప్ప(60) అనే వృద్ధుడు మంగళవారం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కిష్టప్ప కొంత కాలంగా ఆయాసం, ఇతర రోగాలతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నాకి పాల్పడ్డాడు. గమనించిన ఇంటి పక్కల వారు చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

- కేడీసీసీ బ్యాంక్ చైర్ పర్సన్ మహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి
- గోనెగండ్లలో సహకార సంఘం షాపుల ప్రారంభం



గోనెగండ్లలో షాపులను ప్రారంభిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, చైర్ పర్సన్ మహాలక్ష్మి

గోనెగండ్ల : రాష్ట్ర ప్రభుత్వ అధీనంలో పనిచేస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కృషిచేస్తున్నారని కేడీసీసీ బ్యాంక్ చైర్ పర్సన్, మహాలక్ష్మి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రం గోనెగండ్లలోని సహకార సంఘం ఆవరణంలో రూ.11.75లక్షలతో నిర్మించిన నూతన షాపులను మంగళవారం కేడీసీసీ బ్యాంక్ సీఈఓ రామాంజనేయులు, సింగిల్‌విండో అధ్యక్షుడు కాశీవిశ్వనాథ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ సహకార సంఘాల్లో పంట రుణాలతో పాటు, దీర్ఘకాలిక రుణాలను అందజేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మునుపెన్నడూ లేని విధంగా సొసైటీలు సాధారణ రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేస్తున్నారని తెలిపారు. తీసుకున్న రుణాలను రైతులు సకాలంలో చెల్లిస్తే మరింత ఎక్కువగా రుణాలు తీసుకోవచ్చునన్నారు. వైఎస్సార్ హయంలోనే సహకార సంఘాలు బలోపేతం అయ్యాయన్నారు. చైర్ పర్సన్ మహాలక్ష్మి, సీఈఓ రామాంజనేయులు మాట్లాడుతూ గోనెగండ్ల సహకార సంఘం అభివృద్ధి చేసేందుకు రూ.10లక్షలతో వాటర్ ప్లాంట్, రూ.5లక్షలతో ఆఫీస్ రూము, అలాగే రూ.11.75లక్షలతో షాపులను నిర్మించడం జరిగిందని తెలిపారు. సహకారం సంఘం ఆధ్వర్యంలో సొసైటీలను పెట్రోల్ బంకులు, కల్యాణ మండపాలు, గోడౌన్లు తదితరాలు నిర్మించి, వాటి ద్వారా ఆదాయం పెంచి మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార సంఘం అధికారులు విజయ్ కుమార్, సుబ్బారెడ్డి, భరద్వాజ శర్మ, వెంకటరమణ, వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, సీనియర్ నాయకుడు ప్రమోద్ కుమార్ రెడ్డి, మన్సూర్, కన్వీనర్‌దొరబాబు,నాయకులు పాల్గొన్నారు.

జగనన్న పథకాలు దేశానికే ఆదర్శం

ఎమ్మిగనూరుటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నవరత్నాలతో పాటు అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని వైఎస్‌ఆర్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం పట్టణంలోని 32వ వార్డులో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ కోటకొండ నరసింహులు తదితరులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా వార్డు పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మమేకమై సంక్షేమ పథకాల అమలు గురించి అడిగి తెలుసున్నారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగి ఇబ్బంది పడకుండా ఉండేందుకు గాను సచివాలయ వ్యవస్థతో పాటు వలంటీర్లను నియమించడం జరిగిందన్నారు. వార్డు పరిధిలో కొన్ని వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణించాలని ప్రజలు ఆయన దృష్టికి తీసుకొని రాగా.. ఆరునెలల్లోగా ఆయా వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపడతామని జగన్ మోహనన్‌రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్ అహమ్మద్, టౌన్‌బ్యాంక్, కోఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్లు యూకే రాజశేఖర్, షబ్బీర్‌అహమ్మద్, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా

తుగ్గలి : మండల పరిధిలోని దేశాయతండాలో ఎట్టకేలకు మధ్యాహ్నం మంచి నీటి ట్యాంకరు ద్వారా తాగు నీటిని సరఫరా చేశారు. నాలుగు రోజుల క్రితం ఈదురుగాలులకు విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో తాగునీటి సమస్య తీర్చాలని కోరుతూ మంగళవారం మహిళలు రోడ్డుపై ఆందోళన చేశారు. అనంతరం ట్యాంకరు ద్వారా తండాలో నీటిని సరఫరాను పునరుద్ధరణ చేశారు. తండాలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉండడంతో ప్రజలకు ఇబ్బంది కలగకూడదని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆదేశాల మేరకు అధికారులు వారం క్రితమే ట్యాంకరు ఏర్పాటు చేశారు. రోజూ ట్యాంకరు ద్వారా నీటిని సరఫరా చేసేవారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయంతో నీటి సరఫరా ఆగిపోయింది. ఎట్టకేలకు ట్యాంకరు నీటి సరఫరా చేశారు.

వైద్యసేవలు అందించడమే ధ్యేయం

మద్దికెర : ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా వైద్య సేవలు అందించడమే ధ్యేయమని ప్రభుత్వ వైద్యాధికారులు నగేష్, శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరుగుతున్న ఎన్‌సీడీ (నాన్ కమ్యునికేబుల్ డీసీజెస్) ప్రోగ్రామ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నిరంజన్‌బాబు, సూపర్‌వైజర్ కృష్ణమ్మ, ఏఎన్‌ఎం అంజలి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయిస్తే కఠిన చర్యలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్‌ను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సత్యన్న, శ్రీనివాసులు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని శ్రీనివాస థియేటర్ నుంచి సోమేశ్వర టాకీస్ సర్కిల్ వరకు పలు దుకాణాలపై దాడులు నిర్వహించి నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు.

అధ్యాపకుల సమస్యలు పరిష్కరిస్తాం

ఆలూరు: కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. కాంట్రాక్టు పద్ధతిన జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులను క్రమబద్ధీకరణ చేయాలని కోరుతూ యూనియన్ నాయకులు మంత్రి జయరాంకు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి యూనియన్ నాయకులు బ్రమేశ్వర్లు, ఈశ్వర్, రామాంజనేయులు, కృష్ణమూర్తి తదితరులకు హామీఇచ్చారు.



మంత్రి జయరాంకు వినతిపత్రాన్ని అందజేసిన కాంట్రాక్టు అధ్యాపకులు